

# బరితెగింపు!

## ముచ్చర్లలో అర్ధరాత్రి మట్టి మాఫియా హల్చల్

**విచారించి చర్యలు తీసుకుంటాం.. డిప్యూటీ తాసిల్దార్ కరుణాకర్ రావు**

మట్టి తవ్వేందుకు ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు. మా సిబ్బందిని పంపించి పరిశీలన చేయించి నోటీసులు జారీ చేస్తాం. ఎంతటి వారినైనా వదిలే ప్రసక్తి లేదు.

- అనుమతులు లేకుండానే అక్రమంగా తరలింపు
- జేసీబీలతో భూమాత గర్భంపై దాడి
- అసైండ్ భూములే లక్ష్యంగా దోపిడీ
- చీకటి పడితే చాలు జేసీబీల మోత.. టిప్పర్ల జోరు
- ప్రశ్నిస్తే బెదిరింపులు.. ఫిర్యాదు చేస్తే మౌనం
- ముచ్చర్లలోని ఓ కంపెనీ ఆగడాలపై గ్రామస్తుల ఆగ్రహం
- నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న రెవెన్యూ యంత్రాంగం
- అక్రమ దందాకు అడ్డుకట్ట పడేదెప్పుడు?

జిల్లాలోని హత్నూరా మండలం ముచ్చర్ల గ్రామంలోని ఓ కంపెనీ ఆగడాలు మిన్నంటాయి. ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ, ఎటువంటి అనుమతులు లేకుండానే అడ్డగోలుగా మట్టి తరలిస్తూ అక్రమ దందాకు తెరలేపింది. గ్రామస్తుల కళ్లుగప్పి, అధికారులను ఏమాత్రం లెక్క చేయకుండా అర్ధరాత్రి వేళల్లో జేసీబీలతో అసైండ్ భూములను తవ్వుతూ, టిప్పర్లు, ట్రాక్టర్లలో మట్టిని కంపెనీకి తరలిస్తోంది. ఈ అక్రమ తవ్వకాల వల్ల గ్రామంలో భారీ గుంతలు ఏర్పడి, టిప్పర్లు ట్రాక్టర్ల రాకపోకలతో రోడ్లు సైతం పాడవుతున్నాయి.

- సంగారెడ్డి, (సిరి న్యూస్)

### అర్ధరాత్రి జేసీబీలతో అక్రమ తవ్వకాలు..

ముచ్చర్ల పరిధిలోని అసైండ్ భూములే లక్ష్యంగా ఓ కంపెనీ తన అక్రమ దందాను సాగిస్తోంది. పగటిపూట ఎవరికీ అనుమానం రాకుండా, చీకటి పడగానే జేసీబీలను రంగంలోకి దించుతోంది. అర్ధరాత్రి కాంతివంతమైన లైట్ల వెలుగులో పొక్లెయినర్లు భూమాత గర్భాన్ని చీల్చుతుంటే, వరుసగా నిలబడిన టిప్పర్లు ఆ మట్టిని నింపుకుని కంపెనీ వైపు పరుగులు తీస్తున్నాయి. ఈ దృశ్యాలు ముచ్చర్లలోని ఓ కంపెనీకి చట్టాలన్నా, ఇక్కడి ప్రజల ప్రాణాలన్నా ఎంత చులకన భావం ఉందో స్పష్టంగా తెలియజేస్తున్నాయి.

### ప్రశ్నిస్తే బెదిరింపులు..

ముచ్చర్లలోని ఓ కంపెనీ అక్రమాలను ప్రశ్నించిన గ్రామస్తులకు బెదిరింపులు ఎదురవుతున్నాయి. మట్టి దొంగలు చెలరేగిపోతుంటే, వారిని అడ్డుకోవాల్సిన అధికార యంత్రాంగం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మట్టి మాఫియా ఆగడాలతో విసిగిపోయిన గ్రామస్తులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో తాత్కాలికంగా మట్టి తరలింపు ఆగినప్పటికీ, మళ్లీ షురూ చేశారు. అయితే మట్టి మాఫియా అధికారులకు తెలియకుండా ఇదంతా చేస్తున్నారా అని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

### భారీ గుంతలతో భీతావహం..

అనుమతులు లేకుండా ఓ కంపెనీ చేసిన అడ్డగోలు తవ్వకాల వల్ల ముచ్చర్ల గ్రామ పరిసరాలు భయానకంగా మారాయి. ఎక్కడికక్కడ భారీ గుంతలు ఏర్పడి, అగాధాలను తలపిస్తున్నాయి. వర్షాకాలంలో ఈ గుంతలు నీటితో నిండి, పశువులకు, మనుషులకు ప్రాణసంకటంగా మారే ప్రమాదం ఉంది. మా భూములు, మా ఊరు పాడుచేస్తున్నారు. చట్టాన్ని గౌరవించని ఆ కంపెనీపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి, పూర్తిస్థాయి విచారణ జరిపి, అక్రమ మట్టి తరలింపును శాశ్వతంగా అడ్డుకోవాలని, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ముచ్చర్ల ప్రజలు కోరుతున్నారు.





